

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెలుగు నిధులు కైంకర్యంపై మంత్రి పార్ధసారథి ఆరా

నూజివీడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళా గ్రుపులకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పార్ధసారథి అధికారులకు సూచించారు. 'వెలుగు నిధులు కైంకర్యం!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 12 ప్రచురితమైన కథనంపై మంత్రి కొలుసు పార్ధసారథి స్పందించారు. ఈ విషయమై వెలుగు అధికారులను మంత్రి ఆరా తీసినట్లు సమాచారం. సంబంధిత అధికారులు నిధులు దారి మళ్లిన విషయం నిజమేనని, ఇంకా లెక్కలు పూర్తిగా తేలలేదని, సోమవారం నాటికి ఎంత నిధులు దారిమళ్లినదీ తెలియజేస్తామని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. గ్రూపు మహిళలకు ఎలాంటి నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని, వారి డబ్బు వారికి చేరేలా చట్టపరమైన చర్యలు తీసుకుని అవసరమైతే కేసునమోదు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. గత పది రోజుల నుంచి మొహం చాటేసిన బుక్‌కీపర్ భార్గవి, ఆమె భర్త శనివారం గ్రామంలోకి వచ్చి మీ డబ్బును మీకు త్వరలో అందజేస్తామని, కొద్దిగా సమయం ఇవ్వమని కోరినట్లు సమాచారం. దీనిపై సోమవారం వెలుగు అధికారులు, మహిళా గ్రుపులు, గ్రామంలో సమావేశమై చర్చించనున్నట్లు సమాచారం.

15.33 లక్షల మంది ఉచిత ప్రయాణం

- స్త్రీశక్తి అమలుకు నెల రోజులు పూర్తి
- ఆర్టీసీకి రూ.5.33 కోట్లు చార్జీల భారం
- ప్రయాణాలకు అనువుగా ఏర్పాట్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్త్రీశక్తి పథకాన్ని మహిళలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటున్నారు. ఆర్టీసీలో మహిళలకు ఆగస్టు 15న ఉచిత ప్రారంభించడంతో నెల రోజుల్లో 15,33,721మంది ప్రయాణించారు. జిల్లాలో తొలుత 177 బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశం ఉండగా ఇటీవల మరో ఆరు బస్సులను పెంచారు. తెలంగాణ అంతరాష్ట్ర సర్వీసుల వద్ద జిల్లా తరపున కొత్తగా అశ్వారావుపేటకు బస్సులను పెంచారు. ఉచితానికి వాడుతున్న బస్సులు సంఖ్య 183కు చేరింది. ఆగస్టులో మొదట 16 రోజులకు 7,49,29 ప్రయాణించగా ఆదివారం నాటికి ఆ సంఖ్య 15,33,721మందికి చేరడం విశేషం. నెలరోజుల్లో ఏలూరు బస్సు డిపో నుంచి అత్యధికంగా 6,77,519 మంది ప్రయాణించారు. జంగారెడ్డిగూడెం డిపో నుంచి 5,32,618 మంది, నూజివీడు డిపో నుంచి 3,23,618 మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించారు. నెలరోజుల మహిళా ప్రయాణికుల భారాన్ని ప్రభుత్వం రూ.5,33,21,000 భరించింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సి ఉంది.

బస్సుల్లో చిల్లర దొంగతనాలు, సెల్‌ఫోన్ దొంగతనాలు జోరు ఇటీవల తగ్గింది. మరోవైపు కండక్టర్లు ఉచిత టిక్కెట్లు ఇవ్వడానికి విసుగుచెందుతున్నారన్న ఆరోపణలున్నాయి. సంబంధిత ఆధార్, రేషన్‌కార్డు చూపకపోతే టిక్కెట్లు జారీ చేస్తుండటంతో అక్కడక్కడ సమస్యలు ఉత్పనం అవుతున్నట్లు సమాచారం.

సమస్యలను అధిగమించాం

నిరంతరం మహిళల ప్రయాణాలను పర్యవేక్షిస్తున్నాం. ఎలాంటి సమస్యలు ఉత్పనం కాలేదు. కండక్టర్లు, డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తే ఆయా డీఎంలకు ఫిర్యాదు చేయవచ్చు. విజయవాడలో సెంట్రల్ కంప్లైంట్ విభాగానికి వ్యక్తిగతంగా, మెయిల్ ద్వారా ప్రజలు సమస్యలను విన్నవిస్తున్నారు. వాటిని సకాలంలో పరిష్కరిస్తున్నాం. ఇప్పటి వరకు సమస్యలేమి ఉత్పన్నం కాలేదు.

- షేక్ షబ్బం, డీపీటీవో





వేతన వెతలు!

- మూడు నెలల బకాయి
- ఉపాధి కూలీల గగ్గోలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వేతనాలందక గగ్గోలు పెడుతున్నారు. మూడు నెలలుగా కూలి డబ్బులు జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఉపాధి కూలీలకు సుమారు రూ.86 కోట్ల వేతన బకాయి రావాల్సి ఉంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 27 మండలాల పరిధిలో మొత్తం 3.77 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 5.57 లక్షల మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన ప్రకారం ప్రతీ 15 రోజులకొకసారి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు. మూడు నెలలుగా వేతనాలు కోసం ఎదురు చూస్తున్నారు. చివరగా జూన్ 6న వేతనం జమ అయ్యింది.

తగ్గిపోయిన హాజరు

సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఉపాధి పనులకు కూలీల హాజరు తగ్గిపోయింది. బకాయిలను అధికారులను అడిగితే నిధులు రాగానే జమ చేస్తామంటున్నారని, ఎప్పుడొస్తాయో చెప్పడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి లేక చాలా మంది కూలీలు బతుకు దెరువు కోసం బెంగుళూరు, కేరళ వంటి ప్రాంతాలకు వలస వెళుతున్నారు.

కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి?



మూడు నెలలుగా కూలీ డబ్బులు లేవు. నెలలు తరబడి కూలీ చెల్లించకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. వేతనాలు సకాలంలో జమ కావడం లేదు. ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే మం జూరు చేయాలి. సకాలంలో చెల్లిస్తే పనులు చేయడానికి ఉత్సాహం ఉంటుంది.

- భవాని, ఉపాధి కూలీ, కొక్కిరాయలంక

ఉపాధి హామీ పథకం అమలులో విఫలం



జిల్లాలో ఉపాధి పథకం అమలులో ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారు. కేంద్రం ఇచ్చే లక్ష్యం అమలు చేయడం తప్ప పని ప్రదేశాలలో కూలీల ఇబ్బందులు, సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. బకాయిలు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారు.

-పి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా కార్యదర్శి

పొంగిన వాగులు



బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం వద్ద జల్లేరు వాగుపై కొట్టుకుపోయిన కల్వర్టు

ఏజెన్సీలో భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహించాయి. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలో జల్లేరు వాగుపై కల్వర్టు కొట్టుకుపోయింది. తమ్మిలేరుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరడంతో దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ముసునూరు, నూజివీడు మండలాల పరిధిలో రామిలేరు వాగు ఉధృతితో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

బుట్టాయగూడెం, ముసునూరు, నూజివీడు టౌన్, చాట్రాయి, చింతలపూడి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు కొండవాగుపై కల్వర్టు కొట్టుకుపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. కల్వర్టును ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదివారం పరిశీలించారు. త్వరితగతిన తాత్కాలిక పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ముసునూరు మండలంలోని సింహాద్రిపురం వద్ద ప్రధాన రహదారిపై రామిలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

రహదారులపై వరద నీరు.. నిలిచిన రాకపోకలు

ముసునూరు - నూజివీడుకు రాకపోకలు స్తంభించాయి. రామ చెరువు పూర్తిస్థాయిలో నిండి కళంగి నుంచి వరద నీరు వస్తుండడంతో వాగులో ఉదయం నుంచి వరద ప్రవాహం పెరిగింది. ప్రధాన రహదారిపై సుమారు 3 నుంచి 4 అడుగుల నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రామిలేరు వాగు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నా అధికారులు చర్యలు చేపట్టలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెక్కపల్లి పెద్దచెరువుకు నీరుచేరే బాసవర ప్పాడు వాగులో అంబేడ్కర్‌కాలనీ వద్ద అక్రమ కట్టడాలతో నీటి ప్రవాహానికి పంట భూములు కోతకు గురవుతున్నాయి.

నూజివీడు మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దిగవల్లి గ్రామ పరిధిలో రాళ్లవాగు పొంగి పొర్లడంతో దిగవల్లి, రమణక్కపేట తదితర గ్రామాలకు వాహనాలు వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు తుక్కులూరు, జంగంగూడెం, దేవరగుంట తదితర గ్రామాల మీదుగా రామిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుత భారీ వర్షానికి చెరువులకు నీరు చేరగా, నూజివీడు డివిజన్ పరిధిలో మొక్కజొన్న, పత్తి పంటలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.

చాట్రాయి మండలం కొత్తగూడెం-యర్రావారిగూడెం గ్రామాల మధ్య ఉప్పువాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చాట్రాయి-బూరుగుగూడెం మధ్య పెద్ద చెరువువాగు, జనార్ధనవరం-చాట్రాయి మధ్య ఉప్పువాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



సింహాద్రిపురం ప్రధాన రహదారిపై వరద నీరు

తమ్మిలేరు రిజర్వాయరుకు వరద

చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయరుకు ఎగువ నుండి వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 1700 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి మట్టం 348 అడుగులు ఉందని ఏఈ లేజర్‌బాబు తెలిపారు.

పోలవరం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



పోలవరం బోట్ పాయింట్ వద్ద వరద ఉధృతి

కుక్కునూరు/పోలవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద భద్రాచలం వద్ద తగ్గుముఖం పడితే పోలవరం వద్ద పెరుగుతోంది. భద్రాచలం వద్ద ఆదివారం ఉదయం 36.2 అడుగులు ఉండగా సాయంత్రానికి 36 అడుగులు ఉంది. పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 6,05,754 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 30.700 మీటర్లు, దిగువన 21.600 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద ఉధృతంగా ఉంది. ఏజెన్సీ కొండవాగులు కొవ్వాడ కాలువ, రేపల్లెవాడ, గుంజవరం, జిల్లేల్లగూడెం కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగుల జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ రెగ్యులేటర్‌లో 23 గేట్ల ద్వారా గోదావరిలో కలుస్తున్నాయి. కడమ్మ స్లూయిజ్ వద్ద జలాలు గేట్లను తాకి ప్రవహిస్తున్నాయి. గుంజవరం రేపల్లెవాడ కాజ్‌వేలపై వరద జలాలు ఉధృతంగా ప్రవహించాయి.



ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల గాలింపు
చెన్నమ్మ మృతదేహం

గల్లంతైన మహిళల్లో ఒకరి మృతదేహం లభ్యం

జీలుగుమిల్లి, సెప్టెంబరు 14: (ఆంధ్రజ్యోతి): పూచికపాడుకు చెందిన ఇద్దరు మహిళలు సమీప తెలంగాణ ప్రాంతం చెన్నాపురం వద్ద కూలీ పనికి వెళ్లి వస్తూ కొండవాగు దాటుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయారు. పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఆదివారం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గల్లంతైన వారిలో పాలడుగుల చెన్నమ్మ (50) మృతదేహం లభ్యమైంది. మరో మహిళ పచ్చిపాల వరలక్ష్మి ఆచూకీ సాయంత్రం లభ్యం కాలేదు. డ్రోన్ సిబ్బంది పరిసర కొండవాగుల ప్రాంతాలు పరిశీలించారు. చెన్నమ్మ మృతదేహాన్ని ఆశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆస్పత్రిలో బాధిత కుటుంబీకుల్ని పరామర్శించారు. వారికి తగిన సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సైలు వి.క్రాంతికుమార్, పి.నవీన్‌కుమార్, తహసీల్దారు ఉదయ్ భాస్కర్, సరిపల్లి సత్యనారాయణరాజు ఉన్నారు.

రామిలేరులో యువతి గల్లంతు

నూజివీడు టౌన్: రామిలేరు వాగు దాటుతున్న తుక్కులూరు గ్రామానికి చెందిన యువతి ఆదివారం గల్లంతైంది. తుక్కులూరు పాత దళితవాడకు చెందిన బడిపాటి సర్వేశ్వరరావు కుమార్తె నీరజ (22) ఆదివారం మర్రికుంటలోని చర్చికు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రామిలేరు ఉధృతికి నీటిలో గల్లంతైంది. నీరజ నూజివీడులో బి ఫార్మసీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. యువతికోసం నూజివీడు రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

అయ్యో.. రొయ్య !

- నెల రోజులలోపు రొయ్యకు వైరస్
- వాతావరణ మార్పులు
- రైతులకు నష్టాలు
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు



వైరస్.. వైరస్.. ఆక్వా రైతుల నోట ఇప్పుడు ఇవే మాటలు.. మీ చెరువు వైపు వెళ్లకు.. ఆ దారిలో చెరువు పోయింది. 18 రోజులకే వైరస్ వచ్చింది. జాగ్రత్త.. అదేంటి నెలరోజుల లోపు పిల్ల రొయ్యలకు వైరస్ రాదు కదా.. ఏమో మా పక్కన 15 రోజులకే వైరస్ ఎటాక్‌తో చెరువుపోయింది. ఆక్వా రైతులు కలిసినా.. ఫోన్‌లో అయినా.. ఇదే సంభాషణ. నెల రోజులుగా వాతావరణంలో మార్పులు, నాణ్యత లేని సీడ్‌తో వైరస్ వ్యాప్తి చెందుతోంది. పిల్ల దశలోనే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ఆక్వాకు గడ్డుకాలం. ప్రస్తుత వాతావరణ పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. వర్షాకాలంలో ముసుర్లు, తుఫాన్లు, అల్పపీడనాల వంటి పరిస్థితులతో డీవో సమస్యలు వచ్చి పిల్లవేసి 40 రోజులు దాటిన చెరువులు మాత్రమే ప్రభావితమయ్యేవి. ప్రస్తుతం రోజులతో సంబంధం లేదు. చెరువులో వేసిన 15 రోజుల వయసు రొయ్య పిల్ల కూడా వైరస్‌తో చనిపోతోంది. వాతావరణంలో మార్పుల వల్ల నీటిలో పారామీటర్స్ మారిపోతుంటాయి. దీంతో రొయ్యలలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. దీంతో వైరస్ బారిన పడుతున్నాయి. రొయ్యలు ఈదడం మొదలు పెడతాయి. ఆలస్యం చేస్తే చనిపోయి కిందికి దిగిపోతాయి. ఇవి ఈదడం ప్రారంభించగానే కాకులు, కొంగలు, పక్షులు వేటాడడం ప్రారంభిస్తాయి. వీటిని తీసుకెళుతూ పక్క చెరువులలో పడవేయడం, వాటిలో వాలడం చేస్తే చాలు వాటి ద్వారా పక్క చెరువులకు వైరస్ సోకుతుంది. ఈవిధంగా ప్రస్తుతం దాదాపు 95 శాతం సాగు వైరస్ ఎటాక్‌తో నష్టం వాటిల్లింది. మిగిలిన సాగు భయాందోళనల మధ్య సాగుతున్నది. తక్కువ రోజులు ఉన్న చెరువులలో పిల్లలను కొనుగోలు చేసేవారు లేక పట్టుబడి ఖర్చులు రావని మందులు పిచికారీ చేస్తున్నారు.

నాణ్యత లేని సీడ్, వాటర్

తక్కువ ఖరీదుకు వస్తుంది.. లక్షకు లక్ష బోనస్ వంటి వాటితో నాణ్యత పాటించని హేచరీలలో రైతులు సీడ్ కొనుగోలు చేస్తున్నారు. తక్కువ రేటుకు సీడ్ కావాలన్న ఆలోచన పసిగట్టిన హేచరీలు నాసి రకం పిల్లను అంటగట్టడంతో వాటిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అంటువ్యాధిలా అన్ని చెరువులకు పాకేస్తున్నది. అనుమతిలేని హేచరీలను నియంత్రించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రొయ్యల చెరువుల్లో నీటిని నేరుగా పంట కాలువలలోకి వదిలేస్తున్నారు. కాలువ పైన ప్రాంతంలో వదిలిన నీటినే దిగువ ప్రాంతంలో ఉన్న చెరువుల వారు నింపుకోవాల్సిన పరిస్థితి. దీంతో కలుషితమైన నీటిని నింపుకుని మందులు పిచికారీ చేసి సాగు చేస్తుండడం వల్ల ఇబ్బందులు తలెత్తున్నాయని రైతులు తెలియ జేస్తున్నారు. రొయ్యల సాగునీటిని మురుగు కాలువలలోకి మాత్రమే వదిలేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాపారుల కనుసన్నల్లోనే అంతా

రొయ్యలను కొనుగోలు చేసే వ్యాపారస్తుల కనుసన్నల్లోనే అంతా జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీడ్ ఎంత కొనుగోలు చేశారు? ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నది? ఫీడ్ ఎంత వెళుతున్నది? వైరస్, వైట్‌గట్, ఈహెచ్‌పీ వంటి వ్యాధులు వల్ల ఏ కౌంటు ఎక్కువగా వస్తు న్నది తెలుసుకుని ఆయా ధరలు తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. 100 కౌంటు ధర రూ.235 ఉన్నప్పటికీ షరతులు వర్తిస్తున్నాయి, టన్నేజీ 3 కన్నా ఎక్కువగా ఉండాలని, వైరస్, విబ్రో సోకిన రొయ్యలకు ధర తగ్గిస్తున్నారు.

ఇదిలా ఉండగా 100 కౌంటు నుంచి దిగువకు 90, 80, 70, 60 కౌంటు రొయ్యల ధరలకు మధ్య పెద్ద వ్యత్యాసం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో వీటి మధ్య రూ.20 నుంచి రూ.200 వరకు వ్యత్యాసం ఉండేది, ప్రస్తుతం అది కేవలం రూ.100 లోపే ఉందని రైతులు వాపోతున్నారు. ట్రంప్ ఎఫెక్టు వలన పెద్దకౌంటు అయిన 20 నుంచి 50 వరకు ఇబ్బం దులున్నా ఆపై కౌంటులకు ఎఫెక్టు ఎక్కువగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం, వ్యాపారులు ఒకేసారి ఆక్వా రైతులను నష్టాల ఊబిలోకి తోస్తున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని హేచరీల ద్వారా నాణ్యమైన సీడ్‌ను అందించాలని, కోల్డ్ స్టోరేజీలు నిర్మించి ఆక్వా రైతులకు అండగా ఉండాలని కోరుతున్నారు.



నేడే విడుదల

డీఎస్సీ-2025 ఎంపికైన అభ్యర్థుల జాబితా సిద్ధం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాలు సోమవారం విడుదల చేయడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. జాబితాలను ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్, జువనైల్ వెల్ఫేర్ యాజమాన్యాల వారీగా, పోస్టుల వారీగా రూపొందించారు. వీటిపై డీఎస్సీ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ ఆమోదం తీసుకున్నట్టు కన్వీనర్, ఉమ్మడి జిల్లా డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ఆదివారం వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1074 పోస్టులను భర్తీచేయనున్న విషయం విదితమే. అభ్యర్థుల తుది ఎంపికజాబితాలను ఏలూరులోని కలెక్టర్, డీఈవో కార్యాలయాల్లో ప్రదర్శించడంతోపాటు, అధికారిక వెబ్‌సైట్ apdsc.apcfss.inలో అందుబాటులో ఉంచుతారు. రెండుదఫాలుగా మెడికల్ బోర్డు నిర్వహించిన వైకల్య శాతం అసెస్‌మెంట్ టెస్టులో వ్యత్యాసాల కారణంగా మెరిట్‌లో తనకు అన్ని అర్హతలున్నప్పటికీ సెలక్షన్ జోన్ పరిశీలన నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ జిల్లాకుచెందిన దివ్యాంగుల(పీహెచ్) కోటా అభ్యర్థిని ఒకరు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిసింది. దీంతోపాటు రాష్ట్రస్థాయిలో రాయలసీమకు చెందిన కొందరు అభ్యర్థులు పోస్టుల (స్కూల్ అసిస్టెంట్/ఎస్జీటీ) కేటాయింపు విధానాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానం తలుపు తట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాలకు ఎంపికైన తుది జాబితాలు సోమవారం విడుదల కానుండడం గమనార్హం. దీనిపై విద్యాశాఖ ఎలా స్పందించిందీ తెలియరాలేదు.

మరోవైపు డీఎస్సీ ఉద్యో గాలకు ఎంపికైన అభ్యర్థుల తుదిజాబితాలు సోమవారం విడుదల చేస్తుండడంతో, ఉమ్మడి జిల్లాలో మండలాలవారీగా ఉద్యోగాలు పొందిన వారిని గుర్తించి, వారిని 18న ఏలూరుకు తీసుకురావడం, ఎంపికచేసిన పాఠశాలల్లో భోజన, వసతి ఏర్పాట్లు కల్పించడం, 19న ఉదయం వెలగపూడిలో జరిగే నియామకపత్రాల అందజేత కార్యక్రమానికి తీసుకెళ్లే పనులను పర్యవేక్షించడానికి డీవైఈవోలు, ఎంఈవోలకు ఇన్‌చార్జి బాధ్యతలను డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదివారం అప్పగించారు. వీరందరితో సోమవారం సమావేశం ఏర్పాటుచేసి, పాఠశాలలవారీగా బాధ్యతలను కేటాయించనున్నారు.

కొరవడిన స్ఫూర్తి
రెండేళ్లుగా నిలిచిన 'ఇన్‌స్పైర్ మనక్'
ఈ ఏడాది సైన్స్ ప్రదర్శనలకు నామినేషన్ల స్వీకరణ
నేటితో ముగియనున్న గడువు

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ఉల్లి దిగుమతులు

ద్వారకాతిరుమల ఆలయంలో రికార్డు అసిస్టెంట్ చేతివాటం

'గేట్' శిక్షణకు ఆన్‌లైన్ పరీక్ష

నేటి నుంచి వదర్లపాడు రైల్వేగేటు మూత

అధికారులు ఉత్తమ సేవలందించాలి
ఐజీ అశోక్‌కుమార్

లోపలి పేజీల్లో..

రెండేళ్లుగా నిలిచిన 'ఇన్‌స్పైర్ మనక్'

బాల మేధావుల సృజనాత్మకతకు అందని స్ఫూర్తి

- జిల్లా ప్రదర్శనల నుంచే రాష్ట్ర, జాతీయస్థాయి ఎగ్జిబిషన్లకు ఎంపికలు
- ఈ ఏడాదైనా జాతీయస్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన జరిగేనా ?
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ గడువు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థి దశ నుంచే ఆసక్తి కల్పించడం ద్వారా బాలల మదిలో మెదిలే నూతన ఆవిష్కరణలకు అంకురార్పణచేవ్వాలనే లక్ష్యంతో పాఠశాల స్థాయిలో అమలుచేస్తోన్న ప్రేరణ/స్ఫూర్తి(ఇన్‌స్పైర్ మనక్) కార్యక్రమం క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లకే పరిమితమవుతోంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ(డీఎస్టీ) నేతృత్వంలో జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాల్లో ఎస్సీఈఆర్టీ సహకారం తీసుకుని జిల్లాల్లో ప్రభుత్వ గుర్తింపువున్న అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలను సైన్సు అంశాల్లో నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయించడం ద్వారా వారిని బాల మేథావులుగా ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఇన్‌స్పైర్ (ఇన్నోవేటివ్ ఇన్‌సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్), మనక్ (మిలియన్ మైండ్స్ అగ్‌మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) అవార్డులకు ఏటా విద్యార్థులను ఎంపికచేయడం మినహా వారు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు విద్యాశాఖ అవకాశం ఇవ్వడం లేదు. గత రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఫలితంగా జిల్లాల్లో ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు కేంద్రప్రభుత్వ మిచ్చే నగదు ప్రోత్సాహకాలను తీసుకోవడం తప్ప వారు తయారు చేసిన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో ప్రదర్శనకు పెట్టడానికి అవకాశం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత విద్యాసంవత్సరానికి(2025-26) సంబంధించి తాజాగా మరోదఫా ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు విద్యార్థులనుంచి రిజిస్ట్రేషన్లకు ఆహ్వానం పలికిన డీఎస్టీ, ఎస్సీఈఆర్టీలు బాలబాలికలు రూపొందించిన సైన్సు ప్రాజెక్టులను మళ్లీ కాగితాలకే పరిమితం చేస్తాయా లేక జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ప్రదర్శనల వరకు ప్రతిభగల బాలమేథావులను ప్రోత్సాహిస్తాయా అనేదానిపై డైలమా నెలకొంది.

రెండేళ్లుగా కాగితాలకే సైన్సు ప్రాజెక్టులు పరిమితం..

అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు రిజిస్ట్రేషన్ చేసుకుని, నామినేషన్లను సబ్మిట్‌చేసేందుకు అర్హులే. ఆ మేరకు ఒక్కో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు సైన్సు ప్రాజెక్టులు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు, జూనియర్ కళాశాలనుంచి ఏడు ప్రాజెక్టుల వరకు ఈ-ఎంఐఏఎస్ వెబ్‌పోర్టల్‌లో తమ సృజనాత్మక ప్రాజెక్టు/ఆలోచనలను ఒక కాగితంపై రాసి డాక్యుమెంట్‌గా సబ్మిట్‌చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుల రూపకల్పనలో ఉపాధ్యాయులు గైడ్‌టీచర్లుగా వ్యవహరిస్తుంటారు. ఈవిధంగా అన్ని రాష్ట్రాల నుంచి అందిన డాక్యుమెంట్లనుంచి ఉత్తమమైన ప్రాజెక్టులను ఎంపికచేసి, వాటిని భౌతికంగా తయారుచేసేందుకుగాను ఇన్‌స్పైర్ మనక్ అవార్డులను ఇస్తారు. అవార్డుకి ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ.10వేలు చొప్పున ప్రాజెక్టు వర్కింగ్ మోడల్‌రూపంలో తయారీకిగాను సంబంధిత విద్యార్థి బ్యాంకు ఖాతాకు కేంద్రప్రభుత్వం జమ చేస్తుంది. గైడ్ టీచర్ సాయంతో తయారుచేసిన ప్రాజెక్టుల వర్కింగ్ మోడళ్లను జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించాలి. వీటిని మిగతా పాఠశాలల బాలబాలికలు సందర్శించడానికి ఎగ్జిబిషన్‌ను విద్యాశాఖ ఏర్పాటుచేస్తుంది. వీటిలో ఉత్తమమైన ప్రదర్శనలను ఎంపిక చేసి, రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో వినూత్నమైన వాటిని ఎంపికచేసి దక్షిణ భారతస్థాయికి, అక్కడ ఉత్తమమైన వాటిని జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌కు పంపిస్తారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలనేవి లేకపోవడంతో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులన్నీ కాగితాలు/డాక్యుమెంట్లు/వీడియో చిత్రాలకే పరిమితమవుతున్నాయే తప్ప వాటిని ప్రదర్శనకు పెట్టడంగాని లేదు.

ప్రాజెక్టులు ఉన్నాయా ? లేవా ?

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులకు సంబంధించి వెబ్‌పోర్టల్‌లో సబ్మిట్ చేసిన నామినేషన్ డాక్యుమెంట్లు/ వీడియోల నుంచి ఉత్తమమైనవాటిని ఎంపిక చేయడంతోనే గత రెండేళ్లుగా సరిపెడుతుండడంతో ఇపుడు ఆ ప్రాజెక్టులు సంబంధిత పాఠశాలలు, కళాశాలల్లో భౌతికంగా ఉన్నదీ, లేనిదీ విషయాలపై సందేహాలు నెలకొన్నాయి. మరోవైపు ప్రభుత్వం వర్కింగ్‌మోడల్ ప్రాజెక్టుల గురించి ఎలాగూ పట్టించుకోవపోవడంతో తొలుత ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ సబ్మిట్‌చేసిన డాక్యుమెంట్లు మాత్రమే ఆయా స్కూళ్లలో గైడ్ టీచర్ల వద్ద ఉంటాయని సమాచారం.

జాతీయస్థాయిలో మెరిసిన బాలమేథావుల ఆలోచనలెన్నో..

ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్లలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలే జాతీయ స్థాయిలో మెరియడం గమనార్హం. ప్రమాదకర పరిశ్రమల్లో విషవాయువులు వెలువడిన సందర్భాల్లో ప్రమాదస్థలికి ఎవరూ వెళ్లలేని పరిస్థితుల్లో ఆపదలోవున్న క్షతగాత్రులకు వైద్యసహాయం అందించేందుకు నూతన ఆవిష్కరణగా కలిదిండి జడ్పీ హైస్కూలు విద్యార్థి అబ్దుల్ హుస్సేన్ 2019లో గైడ్‌టీచర్ ఎం.రామకృష్ణ సహకారంతో రూపొందించిన లైఫ్ ప్రొటెక్టర్ రోబో ప్రాజెక్టును జాతీయ ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్(ఢిల్లీ)లో ప్రదర్శించగా వినూత్న ప్రదర్శనగా బహుమతి లభించింది. ఆ తర్వాత 2021లో కొవిడ్ కారణంగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో కైకరం జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎం.దుర్గామంగ, గైడ్‌టీచర్ జాన్ సహకారంతో రూపొందించిన లోకాస్ట్ రోప్ మేకింగ్ మిషన్ ప్రాజెక్టు జాతీయస్థాయి విజేతగా నిలవడమేకాకుండా, ఆ మిషన్ తయారీకి పేటెంట్ హక్కులుకూడా లభించడం విశేషం. ఇలా దాదాపు ప్రతి ఏటా ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్లలో జాతీయస్థాయిలో సత్తాచాటుతుంటే, ఈ పోటీలో పాల్గొనేందుకు ప్రాథమిక అర్హతఅయిన జిల్లాస్థాయి ఎగ్జిబిషన్లను నిర్వహించకపోవడంతో బయటిప్రపంచానికి తెలియకుండానే మరుగునపడుతున్నాయి.

నేటితో నామినేషన్ల గడువు ఆఖరు..

2023-24 విద్యా సంవత్సరంలో ఏలూరు జిల్లా నుంచి ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు మొత్తం 1,108 సైన్సు ప్రాజెక్టుల నామినేషన్లు రిజిస్టర్ కాగా, వాటిలో ఉత్తమమైన 132 ప్రాజెక్టులను సబ్మిట్ చేసిన విద్యార్థులను ఎంపికచేసి ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున ప్రాజెక్టులను రూపకల్పనకు వారి బ్యాంకు ఖాతాలకు కేంద్రం జమచేసింది. ఆ తదుపరి 2024-24లో జిల్లానుంచి 1,816 నామినేషన్లు సబ్మిట్‌కాగా వాటిలో 218 ప్రాజెక్టులను ఎంపికచేసి నిధులు చెల్లించారు. ఈ ఏడాదికి సంబంధించి ఆదివారం మధ్యాహ్నం వరకు ఏలూరు జిల్లాలో 1,664, పశ్చిమ గోదావరి జిల్లాలో 1,091 నామినేషన్లు సబ్మిట్‌కాగా, తుది గడువు ఈనెల15వ తేదీతో ముగియనుంది. దీనిపై జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులును వివరణకోరగా.. రెండేళ్లుగా ఇన్‌స్పైర్ మనక్ జిల్లాస్థాయి ఎగ్జిబిషన్లు జరగకపోవడానికి గల కారణాలు తెలియదు. ఇటీవలే తాను సైన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. గత రెండేళ్లలో జిల్లానుంచి ఎంపికైన ప్రాజెక్టులు ఆయా విద్యాసంస్థల్లో భౌతికంగా ఇప్పుడు ఉన్నదీ, లేనిది తెలియదన్నారు.

నరసాపురం-మైసూర్ మధ్య స్పెషల్ రైళ్లు



నరసాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : దసరా, దీపావళి పండుగల రద్దీని పరిగణనలోకి తీసుకుని దక్షిణ మధ్య రైల్వే నరసాపురం-మైసూర్ మధ్య స్పెషల్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ రైళ్లు ఈనెల 19 నుంచి ప్రతి సోమ, శుక్రవారాల్లో నరసాపురం నుంచి, మంగళ, శనివారాల్లో మైసూర్ నుంచి ఈవిధంగా ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు నడవ నున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. నరసాపురం నుంచి 07033 నంబ రుతో మధ్యాహ్నం 11.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం నాలుగు గంటలకు మైసూర్ చేరుకుంటుంది. తిరిగి అక్కడ నుంచి 07034 నంబరుతో సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.20 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్, వికారాబాద్, తాండూరు, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, ధర్మవరం, హిందూపురం, బెంగళూరు మీదుగా మైసూర్ వెళ్లనుంది. జిల్లాలో ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు రైల్వే స్టేషన్లలో ఆగనుంది.

నేటి నుంచి వదర్లపాడు రైల్వేగేటు మూసివేత

కైకలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కైకలూరు-ఆకివీడు రైలు మార్గంలో వదర్లపాడు రైల్వేగేటు వద్ద ఈనెల 15వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 29వ తేదీ రాత్రి 7 గంటల వరకు మూసివేస్తున్నట్టు కైకలూరు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎండీ రెహమాన్ తెలిపారు. జాతీయ రహదారిపై వదర్లపాడు బ్రాంచి నుంచి సీతనపల్లి వెళ్లే రహదారిలోని 86వ నంబరు రైల్వేగేటును మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నామన్నారు. ఆ రహదారిలో వెళ్లే వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

చెక్ మేట్ సాల్వర్‌లో 'దేవాన్ష్' అరుదైన రికార్డు

తణుకు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తనయుడు దేవాన్ష్ మరో అరుదైన ఘనతను సాధించినట్టు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. ఆదివారం తణుకులో ఆయన మాట్లాడుతూ లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో జరిగిన చెస్ పోటీలకు సంబంధించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించినట్లు తెలిపారు. వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్-175 పజిల్స్‌లో ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణమన్నారు. గతంలో చెక్ డొమైన్‌లోనూ మరో రెండు నెలకొల్పిన దేవాన్ష్ రికార్డు పట్ల రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

అధికారులు ఉత్తమ సేవలు అందించాలి

- ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని చట్టప్రకారం పరిష్కరించి సమర్థవంతమైన అధికారులుగా ఉత్తమ సేవలను ప్రజలకు అందించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదివారం ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు. ఏలూరు రేంజ్ కార్యాలయంలో ప్రొబేషనరీ డీఎస్పీల పనితీరుపై సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్పీల ఉద్యోగ నిర్వహణ, క్షేత్రస్థాయిలో పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు లా అండ్ ఆర్డర్‌లో నిర్వర్తించిన విధులను సమర్థవంతంగా నేర్చుకుని భవిష్యత్ కాలంలో వాటిని వినియోగించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ఆలకించి తగిన సూచనలు, సలహాలతో క్రిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు 'ఉల్లి' రాక

- పది లారీల మహారాష్ట్ర ఉల్లి, మూడు లారీల కడప, కర్నూలు ఉల్లి దిగుమతి
- తగ్గిన వంగ.. పెరిగిన బెండ ధరలు



తాడేపల్లిగూడెం మార్కెట్లో ఉల్లిని పరిశీలిస్తున్న జేసీ

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి ఆదివారం 10 లారీల్లో ఉల్లిపాయలు వచ్చాయి. వీటిని క్వింటా రూ.1000 నుంచి రూ.1700 మధ్య విక్రయించారు. మంచి ఆరుదల, పాతపాయ ధర తగ్గింది. సైజు, నాణ్యత ఆధారంగా వ్యాపారులు మహారాష్ట్ర ఉల్లికి ధరను నిర్ణయించారు.

కడప, కర్నూలు నుంచి మూడు లారీల ఉల్లి..

మార్కెట్‌కు కడప నుంచి రెండు లారీలు, కర్నూలు నుంచి ఒక లారీ ఉల్లిని అక్కడి రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. మూడు లారీల్లో సుమారు 52 టన్నులు వచ్చింది. వీటిలో 32 టన్నుల ఉల్లి మార్కెట్లో రూ.700 నుంచి 1200 మధ్య విక్రయాలు జరిగాయి. వీటిలో 20 టన్నుల ఉల్లికి క్వింటా రూ.600కు దిగువన ధర పలకడంతో జిల్లా జేసీ ఆదేశాలతో ఈ 20 టన్నుల ఉల్లిని వ్యాపారులకు అమ్మకుండా సొసైటీల ద్వారా విక్రయించే చర్యలు చేపడుతున్నారు.

తగ్గిన వంగ.. పెరిగిన బెండ ధరలు

మార్కెట్లో తెల్ల వంకాయ ధర తగ్గింది. గత వారంతో పోల్చుకుంటే కిలోకు రూ.20 తగ్గింది. గతవారం కిలో రూ.80 ఉంటే ఈవారం రూ.60కు పడింది. బెండకాయ ధర మాత్రం కిలోకు రూ.10 పెరిగింది. గత వారం కిలో రూ.20కు విక్రయించిన బెండ కాయలు ఇప్పుడు రూ.30కు విక్రయించారు. బీర రూ.50, దొండ రూ.40, టమాటా రూ.30, పచ్చిమిర్చి రూ.60, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, కాకర రూ.50కు అమ్మారు.

కర్నూలు ఉల్లిని వినియోగించేలా చర్యలు చేపట్టాలి : జేసీ

కర్నూలు ఉల్లిని వినియోగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రైతులకు లాభదాయకమైన ధరలను అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి వ్యాపారు లకు సూచించారు. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి హోల్‌సేల్ ఉల్లి మార్కెట్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కడప, కర్నూలు నుంచి వచ్చిన ఉల్లి ఆక్షన్‌ను స్వయంగా ఆయన పరిశీలించారు. ఉల్లి ధర తక్కువ పలకడంతో హోల్‌సేల్ వ్యాపారులతో ఆయన మాట్లాడారు. కడప, కర్నూలు నుంచి వచ్చిన ఉల్లిని కొనడం ద్వారా ఉల్లి రైతులను ఆదుకోవచ్చన్నారు. ఇక్కడ వచ్చే రేటు కంటే ఎక్కువ రేటుల వచ్చే విధంగా మార్కెట్ యార్డులు, రైతు బజార్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధరల లభించకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని కనీస మద్దతు ధర కల్పించేలా వ్యాపారులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్‌కౌసర్ భానో, మార్కెటింగ్ శాఖ డీడీ పాపారావు, ఏడీ సునీల్‌కుమార్, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, హోల్‌సేల్ వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న యాత్రికులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అందరికీ సెలవురోజు కావడంతో భక్తుల సందడితో ఆలయం శోభిల్లింది. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. దాదాపు 15 వేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటన్నర పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బంగారు కిరీటం అందజేత



బంగారు కిరీటాన్ని అందిస్తున్న దాత



బంగారు కిరీటం

చినవెంకన్న ఆలయ ఉత్సవమూర్తులకు ఓ దాత కానుకగా బంగారు కిరీటాన్ని ఆదివారం అందజేశారు. ఏలూరుకు చెందిన కూచి కృష్ణమూర్తి కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం 14 గ్రాముల బరువైన బంగారు కిరీటాన్ని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తికి అందజేశారు. దీని విలువ దాదాపు రూ.1.40లక్షలు వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నేడు క్షేత్రంలో శ్రీకృష్ణ జయంతి

ఆర్జిత కల్యాణం, సేవలు రద్దు

శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణజయంతి ఉత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. అష్టమి మిగులు తిథితోపాటు రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగే ఈ ఉత్సవ నేపథ్యంలో స్వామివారికి నిత్యం నిర్వహించే ఆర్జిత కల్యాణం, నిత్యార్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. సాయంత్రం నివేదనాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈనెల 16న సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండుగ, గ్రామోత్సవం జరుగుతాయని భక్తులు పాల్గొనాలన్నారు.

క్రైం సమాచారం

మహిళపై చాకుతో దాడి

- బంగారు నల్లపూసల గొలుసు అపహరణ



ఏలూరులో చికిత్స పొందుతున్న మల్లేశ్వరమ్మ

ఏలూరుక్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కిరాణాషాపు నిర్వహిస్తున్న ఒక మహిళపై గుర్తు తెలియని అగంతకుడు చాకుతో దాడి చేసి ఆమె మెడలోని బంగారు నల్లపూసల గొలుసు తెంపుకుని పరారయ్యాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు సమీపంలోని వట్లూరు అంగన్‌వాడీ కేంద్రం దగ్గరలో సింగంశెట్టి మల్లేశ్వరమ్మ, ఆమె భర్త నాగేశ్వరరావు కిరాణాషాపును ఇంట్లోనే నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఓ యువకుడు వచ్చి పాలప్యాకెట్లు కావాలని అడిగాడు. పాలు లేవని ఆమె చెప్పడంతో కూల్‌డ్రింక్ కావాలన్నాడు. ఆమె ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌లోని కూల్‌డ్రింక్ తేవడానికి లోపలికి వెళ్తుండగా ఆమెతోపాటు అకస్మాత్తుగా ఇంట్లోకి వెళ్లి ఆమెను పడవేసి చాకుతో దాడిచేసి మెడలో ఉన్న నల్లపూసల బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమెను ఇరుగుపొరుగు వారు గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు త్రీటౌన్ ఎస్ఐ పి. అప్పారావు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోవైపు అగంతకుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని తిమ్మాపురానికి చెందిన పాతపాటి పద్మజ(42) శనివారం ఉదయం ఇంటివద్ద పురుగుల మందు తాగింది. ఆ తరువాత పాదయాత్రగా ద్వారకాతిరుమలకు వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరింది. కొద్దిదూరం నడిచి వెళ్లిన ఆమె బ్రహ్మంగారి గుడి సమీపంలో పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందిందని ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


'కుక్కునూరు'లో వరుస చోరీల కలకలం

కుక్కునూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండల కేంద్రంలో వరుస చోరీల కలకలం ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కుక్కునూరు గ్రామ శివారులోని రామాలయంలో దాదాపు రూ.36వేలు విలువైన అమ్మవారి మంగళసూత్రాలు చోరీకి గుర య్యాయి. రామాలయంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలో చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. ఆలయంలో ఉండి సేవ చేస్తున్న వీ.శంకుబాబు ఈ సంఘటన పై కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే ఓ హోటల్‌లో పదార్థాల తయారీకి వినియోగించే పెద్ద గిన్నెలు కూడా చోరీకి గురయ్యాయి. కుక్కునూరు గ్రామానికి అనుకుని ఉన్న కిష్టారం గ్రామంలో ఓ రైతుకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీ కూడా చోరీకి గురైనట్లు సమాచారం. పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ లెక్చరర్ల సంఘ
రాష్ట్ర సహ అధ్యక్షుడిగా శ్రీనివాస్



ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) రాష్ట్ర సహ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ బీవీ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. రాష్ట్రప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డును పొందిన ఆయన ప్రస్తుతం నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. నూతన కార్యవర్గ పదవీకాలం మూడేళ్లు. ఇంటర్మీడియట్ విద్యలో విద్యాసంబంధిత వ్యాసాలు, తెలుగు అకాడమీ ప్రచురణల్లో సైన్సు వ్యాసాలు రాశారు. ఎన్నిక అనంతరం నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రాష్ట్రంలో జూనియర్ కళాశాలల పనివేళలను ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేలా సవరించాలని డిమాండ్ చేశారు. జూనియర్ లెక్చరర్లకు డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా పదోన్నతులు ఇవ్వాలని, సర్వీసులో సీనియర్లయిన జేఎల్స్‌కు ప్రిన్సిపాల్స్ పదోన్నతుల్లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



నూజివీడులో పరీక్షకు హాజరైన బీటెక్ విద్యార్థులు

'గేట్' శిక్షణకు ప్రత్యేక ఆన్‌లైన్ పరీక్ష

నూజివీడు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గేట్ ప్రవేశ పరీక్షకు తర్ఫీదు ఇస్తూ ఆర్జీయూకేటీ పరిధిలో హయ్యర్ ఎడ్యుకేషన్, కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ సెల్ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షను నిర్వహించారు. ఇంజినీరింగ్ తృతీయ చివరి సంవత్సరం విద్యార్థులు సుమారు 1500 మంది ఈ ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారు. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వర్సిటీ అధికారుల బృందం తెలిపింది. దాదాపు 150 మంది ఏఎస్ అకాడమీ నుంచి ఉచిత లెక్చరర్స్, టెక్స్ట్ సిరీస్ అందించటం జరుగుతుందని, వర్సిటీ తరపున 500 మందికి, సంబంధిత మెటీరియల్ ఇస్తావతని, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఏవో డాక్టర్ లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకడమిక్ డి.శ్రావణి, పి.శ్యామ్, డాక్టర్ సాదు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తులు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అడవి బిడ్డల ఆరాధ్య దైవం శ్రీగుబ్బల మంగమ్మ దర్శనాలకు భక్తులు ఆదివారం పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు ఏజెన్సీకి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు. శనివారం ఏజెన్సీవ్యాప్తంగా భారీవర్షాలు కురవడంతో కొండవాగులు పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహించాయి. ఆదివారం వాతావరణం పొడిగా మారడం, వాగులు తగ్గుముఖం పట్టడంతో భక్తులు భారీగా తరలివచ్చారు.

ఈ-కంటెంట్ అభివృద్ధి శిక్షణకు టీచర్ స్వామి ఎంపిక



కోటేశ్వరస్వామి

కాళ్ళ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఐటీఈ, ఎన్‌సీఈఆర్‌టీ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. ఆన్‌లైన్ శిక్షణలో మన రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 20 మందిలో పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్, సీనలి ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి ఎంపికయ్యారని కాళ్ల ఎంఈవో డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. దేశవ్యాప్త శిక్షణకు ఎంపికైన స్వామిని ఎంఈవో-2 పి.ఏసుదాసు, ఉపాధ్యాయులు అభినందించారు.

ద్వారకాతిరుమల ఆలయంలో
రికార్డు అసిస్టెంట్ చేతివాటం

ద్వారకాతిరుమల,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానంలో లీజెస్ విభాగంలో పనిచేసే ఓ రికార్డు అసిస్టెంట్ చేతివాటం ప్రదర్శించాడు. గతనెలలో దేవస్థానం నిర్వహించిన వేలంపాటలో పాటదారుడు చెల్లించిన సొమ్ములో రూ.9వేలు తగ్గించి మిస్‌లీనియస్ రసీదు రాసినట్టు సమాచారం. టీటీడీ కాంప్లెక్స్ షాప్ నంబరు 11కు సంబంధించి జరిగిన వేలంపాటలో సదరు రికార్డు అసిస్టెంట్ అనుమంచిపోలు సాయి చేతివాటం ప్రదర్శించాడు. దీన్ని కప్పి పుచ్చేందుకు కొందరు ఉద్యోగులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. హెచ్చు పాటదారుడు సిద్ధయ్య ఆగస్టు ఆరో తేదీన షాపు అద్దె సొమ్ము రూ.51 వేలును రికార్డు అసిస్టెంట్‌కు కట్టాడు. ఆ ఉద్యోగి ఇచ్చిన సొమ్ము మొత్తానికి ఎంఆర్ రాయకుండా రూ.9వేలు తగ్గించి రూ.42వేలుకు మాత్రమే రాశాడు. ఇదిలా ఉంటే రెండురోజుల క్రితం లీజెస్ విభాగం ఏఈవో రమణరాజు పాటదారుడు సిద్ధయ్యకు ఫోన్‌కు చేసి అద్దె చెల్లించమని అడిగాడు. తాను ఆగస్టులోనే రూ.51వేలు చెల్లించానని ఇంకా రూ.7వేలు మాత్రమే బాకీ ఉందని చెప్పాడు. దీనిపై ఏఈవో రూ.42వేలు మాత్రమే కట్టావని చెప్పడంతో అతడు కంగుతిన్నాడు. రికార్డు అసిస్టెంట్ రూ.9వేలు తగ్గించి ఎంఆర్ రాశాడని ఏఈవో రమణరాజు వివరణ ఇచ్చారు. అయితే బాధితుడు సిద్ధయ్య ఇంకా ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

17న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడి యజ్ఞ మహోత్సవం ఈ నెల 17న వైఎంహెచ్ఏ హాల్లో నిర్వహిస్తున్నట్టు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు సింహాద్రి బ్రహ్మాచార్యులు, సెక్రటరీ మానేపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఏలూరు నగరంలో గత 27 ఏళ్ల నుంచి విశ్వకర్మ భగవాన్ యజ్ఞం మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17న ఉదయం 9గంటలకు పతాకావిష్కరణ తదుపరి గణపతి పూజ, అన్నప్రసాద వితరణ, సాయంత్రం నాలుగు గంటల నుండి స్వామివారిని వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

17 నుంచి ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళా-శక్తివంతమైన కుటుంబమే లక్ష్యాలుగా ఈ నెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వస్థనారి స్వశక్త్ అభియాన్ పేరిట సమగ్ర ఆరోగ్య ప్రచారం, సేవా కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం తెలిపారు. అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు వైద్యనిపుణులు, పారామెడికల్ సిబ్బంది నిర్వహిస్తారని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్ముల రమేశ్

ఆయుధ కర్మాగారాన్ని నిలుపుదల చేయాలి : ఆదివాసీలు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం గ్రామ పరిధిలో చేపట్టనున్న నేవీ ఆయుధ కర్మాగారం నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుట్టాయగూడెంలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేశ్ పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం 1600 ఎకరాల్లో చేపట్టనున్న కర్మగార నిర్మాణాన్ని మూడు సార్లు గ్రామసభ వ్యతిరేకించి తీర్మానం చేసినా లెక్కచేయకుండా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మరలా తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. జనవాసాల మధ్య కర్మగారం నిర్మిస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, తెల్లం దుర్గారావు పాల్గొన్నారు.

స్వర్ణకారులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జువెల్లరీ షాపులు రాకతో స్థానిక స్వర్ణకారులకు ఉపాధి కరువైందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని జాతీయ బీసీ సంఘ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి(గోపి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానికంగా సమావేశం జరిగింది. అన్నీ ఆభరణాలు రెడీమేడ్‌గా లభిస్తుండటంతో స్వర్ణకారుల వద్ద నగలు చేయించుకునేవారే కరువయ్యారన్నారు. చిన్న వస్తువు కొనాలన్నా కార్పొరేట్ జ్యువెలరీ షాపులకు వెళుతుండడంతో వ్యాపారం చేసే జ్యువెలరీ షాపులు ఆర్డర్లు లేకపోవడంతో స్వర్ణకారులకి పూర్తిగా వృత్తి కోల్పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం స్వర్ణకారులకి ఉపయోగపడటంలేదన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక అమలోద్భవి కేథడ్రల్ చర్చిలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజీపై అవగాహన కార్యక్రమాన్ని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) జిల్లా కోఆర్డినేటర్ ఆర్. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఏలూరు నగరాన్ని బాల్య వివాహ రహిత నగరంగా తయారు చేయడానికి సమాజంలో ప్రతీ ఒక్కరిపై బాధ్యత ఉందన్నారు. రెవరెండ్ ఫాదర్ ఇంజుమాల మైఖేల్, సహాయ గురువులు రెవరెండ్ ఫాదర్ కె.బాలరాజు, ఇంజుమాల రత్నరాజ్, ఎస్.విజయ్ థామస్, జె.జోజి, ఎం.ఎఫ్. జేవియర్, సిస్టర్ మెర్సి, సిస్టర్ కొంచెం రాణి, సిస్టర్ శిరీష పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,124 కేసుల పరిష్కారం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 13వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్ శాఖకు సంబంధించి 1124 కేసులు పరిష్కారం అయ్యాయని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో క్రిమినల్ కేసులకు సంబంధించి 409, ఎక్సైజ్ కేసులు 22, పెట్టీ కేసులు 577, స్పెషల్ అండ్ లోకల్ లాస్ కేసులు 116 పరిష్కరించామన్నారు. రాజీ మార్గమే రాజమార్గమనే నినాదంతో ప్రజలు ఏకీభవించి తమ కేసులు సామరస్య వాతావరణంలో లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకున్నట్టు తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాల బ్రోచర్లు ఆవిష్కరణ



ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని స్వయంభూ శ్రీ సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయం వద్ద ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ కె.జి.ఎన్.వి.గోపాలకృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులు చినబాబు, కె.నాగభూషణం, శ్రీనివాసరావు, పిల్లి సావిత్రమ్మలు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, సామూహిక పూజలు జరుగుతాయన్నారు.

జిల్లాలో సరాసరి వర్షపాతం 37.2 మి.మీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గడచిన 24గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా లింగపాలెం మండలంలో 116.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 37.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. జిల్లాలో వర్షం కురిసిన మండలాల్లో వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. ముదినేపల్లిలో 79.4, నూజివీడులో 72.2 , వేలేరుపాడులో 72, పోలవరంలో 51.6, ఏలూరు రూరల్‌లో 50.2, కొయ్యలగూడెంలో 49.8, పెదపాడులో 47, ఆగిరిపల్లిలో 46.4, బుట్టాయిగూడెంలో 44.8, టి.నరసాపురంలో 43.2, జీలుగుమిల్లిలో 41.2, ముసునూరులో 40.6, చాట్రాయిలో 39.8, ఏలూరు అర్బన్‌లో 38.4, కామవరపుకోటలో 35.4, చింతలపూడిలో 27.6, మండవల్లిలో 25.6, పెదవేగిలో 23, దెందులూరులో 22.8, కుక్కునూరులో 22.4, భీమడోలులో 16, కలిదిండిలో 14.2, కైకలూరులో 9.4, ద్వారకాతిరుమలలో 8.6, జంగారెడ్డిగూడెంలో 4.2 మిల్లీమీటర్లు వర్షపాతాలు నమోదయ్యాయి.

పోలవరాన్ని వీడని కోతుల బెడద



పోలవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో కోతులు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పోలవరం మండల కేంద్రంలో రాజుల కోట, బెస్తావీధి, నోరివారి వీధి, మసీదువీధి, పాతపోలవరం ప్రాంతాల్లో కోతులు గుంపులుగా సంచరిస్తూ దుకాణాల్లో సరుకులు, నివాసాలలో వంటపాత్ర లు ఎత్తుకుపోతూ పెరటి తోటలను కాయగూరలను, ఆకుకూరల తోటలను ధ్వంసం చేస్తున్నాయి. అదిలించడానికి ప్రయత్నిస్తే దాడులకు తెగబడుతున్నాయి. గడిచిన మూడేళ్లలో కోతుల కారణంగా 50 మంది గాయపడ్డారు. ఈ విషయంపై పలుమార్లు అటవీశాఖ అధికారులకు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలే లేవని ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు నాళం గాంధీ, బాబ్జీ తెలిపారు. అధికారులు కోతులను పట్టించి దూరంగా వదిలిపెట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కోడేలు కూడలి, మస్తాన్ మన్యం కాలనీ పాఠశాల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ తూర్పు వైపు కౌంటర్ నుంచి కోడేలు వెళ్లే దారిలో వంతెన దిగువలోని నాలుగు రోడ్ల కూడలిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మార్జిన్‌లో ప్రమాదకరంగా ఉంది. నాలుగు రోడ్ల కూడలి కావడంతో భారీ వాహనాలు, చేపల లోడు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు వద్ద ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ భారీ వాహనాలకు తగిలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని ప్రజలు అభ్యర్థిస్తున్నారు. స్థానిక మస్తాన్‌మన్యం కాలనీ సమీపంలోని కనకదుర్గమ్మ గుడి పక్కన మలుపులో రోడ్డు మార్జిన్‌లో చిన్న పిల్లలకు సైతం అందేలా విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే రక్షణ గోడలు నిర్మించడంగాని, లేదా వేరే ప్రాంతానికి తరలించడం గాని చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అదుపుతప్పి గోతులో పడి ఒకరికి తీవ్రగాయాలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రహదారిపై ఉన్న గోతులు ఓ వ్యక్తిని తీవ్రగాయాలపాలు చేశాయి. సూర్యచంద్రరావుపేట శివారు కనకాపురం చెరువు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడివాడకు చెందిన తుమ్మల సురేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు గోతుల కారణంగా మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయన్నారు. స్థానికులు 108కి సమాచారమిచ్చి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నగర పంచాయతీపై ఆశలు..

» గత ప్రభుత్వ పాలనలో ప్రతిపాదనలు పంపినా దక్కని ఫలితం
» తాజాగా ఎమ్మెల్యే బాలరాజు చర్యలు
» పంచాయతీ ఎన్నికల నాటికి అయ్యేనా!

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సమితి కేంద్రంగా ఉన్న కొయ్యలగూడెం పట్టణం ఇప్పుడు పరింపూడి పంచాయతీలో శివారు గ్రామం (హేమ్లేడ్)గా కొనసాగుతోంది. పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోనూ అతిపెద్ద మండల కేంద్రంగా కొయ్యలగూడెం ఉంది. అయినా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. పోలవరం నియోజకవర్గం నుంచి జంగారెడ్డిగూడెం విడిపోయిన నాటి నుంచి కొయ్యలగూడెం పట్టణమే ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది.నియోజకవర్గానికి ముఖ్యమైన మార్కెట్ యార్డు, పంచాయతీరాజ్ సబ్ డివిజన్, రూరల్, వాటర్ డెవలప్‌మెంట్ సబ్ డివిజన్ కార్యాలయం(ఆర్‌డబ్ల్యూఎస్), ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం, సాంఘిక సంక్షేమ శాఖ డివిజనల్ కార్యాలయం, కొయ్యలగూడెంలోనే ఉన్నాయి. అయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉంది. ఈ పట్టణాన్ని నగర పంచాయతీగా చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారు. గత ప్రభుత్వంలో నగర పంచాయతీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. కొయ్యలగూడెం, పరింపూడి, గవరవరం, అంకాలగూడెం గ్రామాలను కలుపుతూ నగర పంచాయతీ చేయాలనే ఆలోచన జరిగింది. ఇప్పుడు పంచాయతీలు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం పంచాయతీరాజ్ శాఖ కల్పించడంతో మరలా నగర పంచాయతీ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తాజాగా కొయ్యలగూడేన్ని నగర పంచాయతీగానూ, రాజవరం పంచాయతీలో ఉన్న గంగవరం, మంగపతిదేవిపాలెం గ్రామాలను ఒక పంచాయతీగా, యర్రంపేట పంచాయతీలోని తిమ్మన్నకుంట, గంగన్నగూడెం, ఏడువారాలపాలెం కలిపి ఒక పంచాయతీ, దిప్పకాయలపాడు పంచాయతీలో ఉన్న బొత్తప్పగూడెం, బిల్లిమిల్లి, తంగెళ్లగూడెం, సరిపల్లె పంచాయతీలో ఉన్న కిష్టప్పగూడెం గిరిజన గ్రామాలను కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కలెక్టర్‌కు ప్రతిపాదన పంపినట్టు తెలిసింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొయ్యలగూడెం నగర పంచాయతీగా రూపుదిద్దుకుంటుదని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


కొయ్యలగూడెం ప్రధాన సెంటర్



తాండవిస్తున్న అపారిశుధ్యం

కుక్కునూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు పంచాయతీలోని లంకాలపల్లిలో పారిశుధ్యం లోపించింది. గ్రామంలోని రహదారులు బురదమయంగా మారాయి. అలాగే ఇళ్లలో వాడిన నీరంతా బయటకుపోయే మార్గం లేక రహదారి పైనే నిల్వ ఉంటోంది. దీంతో గ్రామంలోకి అడుగుపెట్టాలంటేనే అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. దీంతో ఆ గ్రామంలో గిరిజనులు వ్యాధుల బారీన పడుతున్నారు. గ్రామంలో సరైన డ్రైనేజీలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని గిరిజనులు వాపోతున్నారు.కుక్కునూరు మేజరు పంచాయతీ అయినా మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టక పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రేపు మండల సమావేశం

టీ.నర్సాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనగరాజకుమారి ఆదివారం తెలిపారు. ఈ సమావేశం మండలాధ్యక్షురాలు దారబోయిన లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు ఆయా శాఖల్లో ఇప్పటి వరకు సాధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

లింగపాలెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారిపై కేసులు నమోదు చేస్తామని ధర్మాజీగూడెం ఎస్ఐ కె. వెంకన్న హెచ్చరించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎక్కువగా మైనర్లకు వాహనాలివ్వడం తల్లిదండ్రులకు అలవాటుగా మారిందని, ఇది సరికాదన్నారు.

బధిరుల కార్యవర్గం ఎన్నిక

ఏలూరురూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా బధిరుల సంఘం సమావేశం ఆదివారం స్థానిక యాదవ్ సంఘం భవనంలో జరిగింది. ఈ సందర్భంగా 2025 నుంచి 2028 మూడేళ్ళ కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.ప్రవీణ్‌వర్మ, ఉపాధ్యక్షుడిగా సి.హెచ్.వీరబాబు, ఎస్.సుధారాణి, జనరల్ సెక్రటరీగా వి.నాగబాబు, జాయింట్ సెక్రటరీగా వి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా కె.నవీన్, సభ్యులుగా జి.అచ్యుత సాయిరాం, కె.రాంబాబు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బధిరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి వి.చంద్రశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసింహారావు పేట ఉప్పురామారావు వీధిలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లుగా ఏలూరు త్రిటౌన్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ పి.అప్పారావు తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.16 వేల 10నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఇస్లాంతో ప్రపంచ శాంతి

ఏలూరురూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇస్లాం ధర్మం ప్రపంచ మానవాళికి శాంతి మార్గం చూపుతోందని సామాజికవేత్త సయ్యద్ సలీం అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మించిన మాసం సందర్భంగా మానవమహోపకారి మహ్మద్ జీవితం అనే అంశంపై జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శాంతి సందేశమిచ్చారు.దేవుడు ఒక్కడే అంటూ అంధకారంలో ఉన్న అరబ్ ప్రజలను అన్ని రంగాల్లో ముందుకు నడిపారని అన్నారు. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. జమాతే ఇస్లామీ హింద్ ఏలూరు నగర అధ్యక్షులు నయిముల్లా, సభ్యులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అంబికాదేవిని పూజించండి

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంబికాదేవిని ఆరాధిస్తే కుటుంబంలో కష్టాలు తొలగిపోతాయని హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంతలక్ష్మి పేర్కొన్నారు. సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అంబికా పురాణాన్ని వివరించారు. అంబికాదేవి అమ్మవారిని ఆరాధిస్తే అంతా మంచే జరుగుతుందని, అంబికా పురాణాన్ని తెలుసుకోవాలని వివరించారు. అంబికా సంస్థల ఎండీ అంబికా ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ, సహాయ అర్చకులు శ్రీనివాసుల శ్రీనివాసాచార్యులు, కపిల శివశంకర్ ప్రసాద్, ఆలయ మేనేజర్ ఓలేటి మల్లికార్జునరావు, మిత్రబృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అంబికా మహత్యాన్ని అనంతలక్ష్మి ద్వారా తెలుసుకున్నారు. తొలుత డాక్టర్ అనంతలక్ష్మి అంబికాదేవి అమ్మవారిని, వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అంబికా మహత్యాన్ని ప్రజలకు వివరించారు.


అమ్మవారి శక్తిని తెలియజేస్తున్న అనంతలక్ష్మి



అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, పెదబాబు

ఘనంగా అమ్మవార్ల జాతర


దెందులూరులో జాతర నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఏలూరు టూటౌన్/ కార్పొరేషన్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఏటా నిర్వహించే గంగానమ్మ సంబరాల్లో పలు డివిజన్లలో ఎమ్మెల్యే చంటి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50వ డివిజన్ అరుణ్ జ్యోతిపేట, మార్కెట్ యార్డులో వీవీనగర్, సాయినగర్, 28, 2, 41, 48 డివిజన్లలోని పలు ప్రాంతాల్లో జరిగిన శ్రీవరసిద్ధి వినాయక మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, ఇడా చైర్మన్ శివప్రసాద్, సొసైటీ బ్యాంకు చైర్మన్ అమరావతి అశోక్, ఆలయ కమిటీ చైర్మన్ వై.సత్తిబాబు, మంచెం మైబాబు, బెల్లంకొండ కిషోర్, నగర టీడీపీ అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్పొరేటర్ తంగిరాల అరుణాసురేశ్ పాల్గొన్నారు. శ్రీగంగానమ్మ సంబరాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ యార్డు వద్ద గంగానమ్మ అమ్మవారిగుడిలో, బావిశెట్టి వారి పేట భూలోకమ్మగుడిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఎమ్మెల్యే వెంట పద్మశాలీయుల సంఘం గౌరవ అధ్యక్షులు నాగులపల్లి గంగాధరరావు, బురిడి చిన్నారావు, చైర్మన్ మెండెం స్వామి, కార్యవర్గ సభ్యులు సంతోష్, తోట సత్తిబాబు, కానూరి చందు, కోశాధికారి ఇమంది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● పోలవరం : మండల కేంద్రంలో గ్రామ దేవతలు కడమ్మ బాపనమ్మల జాతరను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శతాబ్దాలుగా పోలవరం పంచాయతీ జగన్నాథపేట గ్రామస్థులు గ్రామ పొలిమేర దేవతలు కడమ్మ బాపనమ్మలు జాతర మేళతాళాలతో, తీన్‌మార్ వాయిద్యాలతో నిర్వహించారు. ఉదయం పాత పోలవరం పొలిమేర వద్ద ఉన్న మాతృశ్రీ కడమ్మ అమ్మవారికి, సాయంత్రం ఇటుకల కోట సమీపంలో ఉన్న మాతృశ్రీ బాపనమ్మ అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించారు.

● దెందులూరు: గ్రామ దేవత మద్దిరావమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు, తొగర కులస్తులు భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆదివారం గణాచార్యులు, భక్తులు చిత్ర విచిత్ర వేషధారణాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని 116 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

● చింతలపూడి: నగర పంచాయతీలోని వెలమపేటలో ఉన్న ముత్యాలమ్మ ఆలయం 74వ వార్షికోత్సవం సందర్భంగా గత తొమ్మిది రోజులుగా పూజా కార్యక్రమాలు, సారె నిర్వహించి పదవ రోజు ఆదివారం గ్రామంలో ఘనంగా ఊరేగింపు జరిపారు. కోలాటం, అమ్మవార్ల వేషధారణ, డీజే సౌండ్, విచిత్ర వేషాలతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో బాణసంచా కాల్పులతో ఊరేగించారు. ముత్యాలమ్మ ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● పెదవేగి: రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు,పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు.భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్

అభివృద్ధికి ఐక్యంగా పని చేస్తాం

చింతలపూడి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'మమ్మల్ని విడగొట్టాలని ఎవరు ప్రయత్నం చేసినా అది జరగదు'అని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరంలో ఎర్రంపల్లి సొసైటీ చైర్ పర్సన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ మాట్లాడుతూ ఎవరు ఎలాంటివారో తాను గ్రహించగలనని అన్నారు. అభివృద్ధే లక్ష్యమని, రాజకీయం చేయడానికి ఇంకా సమయం ఉందన్నారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ పార్టీని అభిమానించేవారు చిత్తశుద్ధితో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పదవులు రానివారు నిరాశ పడొద్దని, ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ప్రధానమని ఎంపీ, తాను కలిసే పనిచేస్తామన్నారు. అనంతరం యర్రంపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చేత ప్రమాణం చేయించారు.ప్రగడవరం పంచాయతీలో రోడ్లు బాగోలేదని సొసైటీ చైర్మన్ టి.చంద్రశేఖరరెడ్డి కోరడంతో తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. సభలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే కూనేరావు సేవలు చిరస్మరణీయం

దెందులూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే మొటపర్తి కూనేరావు సేవలను ప్రజలు ఎప్పటికీ మరువలేరని దెందులూరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం దెందులూరులోని ఇంద్రవనంలోని మాజీ ఎమ్మెల్యే కూనేరావు వర్ధంతిని నిర్వహించారు. గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు మత్సకారుల కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రగతి విద్యా సంస్థల అధినేత మొటపర్తి రాజాబాబు, సంపంగి వేణుగోపాల తిలక్, సర్పంచ్ యేసమ్మ, వేమూరి మురళీ, కూనేరావు కుమార్తె బుజ్జమ్మ ఉన్నారు.


జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఎర్రకాలువ జలాశయానికి తగ్గని వరద

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద ఉధృతి ఆదివారం కూడా కొనసాగుతూ వచ్చింది. శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి 5143 క్యూసెక్కుల వరదనీరు జలాశయంలోకి చేరుతుండగా దిగువకు విడుదల చేసినట్టు ఇరిగేషన్ డీఈ కె.సునీత తెలిపారు. జలాశయం నీటి సామర్థ్యం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.69 మీటర్లకు చేరిందని తెలిపారు. ఈ నేపథ్యంలో గస్తీ ఏర్పాటు భారీ వర్షాల కారణంగా ఎర్రకాలువ జలాశయానికి శని, ఆదివారాల్లో వరదనీరు అధికంగా చేరుతుండటంతో ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇరిగేషన్ అధికారులు ఎర్రకాలువ జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ యు.రవిచంద్ర కోరారు. ఎర్ర కాలువ జలాశయం వద్ద, పంగిడిగూడెం, రాజవరం రహదారి వద్ద ఉన్న ఎర్రకాలువ వాగు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో ఎటువంటి ప్రమాదం జరగకుండా రాత్రిళ్లు గస్తీ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఉధృతి తగ్గే వరకు వాగులు దాటొద్దు

టి.నర్సాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాలకు ప్రవహిస్తున్న వాగుల ఉధృతి తగ్గే వరకు వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని ఎస్.ఐ. ఎం.జయబాబు హెచ్చరించారు. మండలంలోని మక్కినవారిగూడెం వద్ద ఉన్న జలవాగు బండివారిగూడెం సమీపంలో ఉన్న ముగ్గురాళ్లవాగు అప్పలరాజుగూడెం సమీపంలో ఎర్రకాల్వలు గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్.ఐ. జయబాబు, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో వాగుల వద్ద రోడ్డు మార్గాలు నిర్బంధించి రాకపోకలు నిలిపివేసి ప్రమాదాల నివారణకు భద్రాతా ఏర్పాట్లు చేశారు. రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన రక్షణ వలయాలు తొలగించవద్దని ప్రమాదకర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రక్షణ వలయాలు పక్కకు నెట్టి ప్రమాదాలకు గురి కావద్దని హితవుపలికారు.

● పోలవరం: ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగులు దాటవద్దని ఎస్ఐ పవన్ కుమార్ హెచ్చరించారు. గుంజవరం, జిల్లేళ్లగూడెం, సున్నాలగండి, రేపల్లెవాడ కాజ్‌వే సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద రూ.73 లక్షలతో కాజ్‌వే నిర్మాణం


కాజ్‌వేను ప్రారంభిస్తున్న రోషన్, చిర్రి, కరాటం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలంలోని పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద రూ.73 లక్షలతో నిర్మించిన కాజ్‌వేను ఆదివారం చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తామన్నారు. అప్పటి వరకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన కాజ్‌వే నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని సుమారు 25గ్రామాలకు అనుసంధానం చేసే ఈ కాజ్‌వేను కూటమి ప్రభుత్వం హయాంలో నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఆకుల రాకేశ్, టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు..

చేతికి తగిలే ఎత్తులో విద్యుత్ వైర్లు
తప్పుపట్టిన స్తంభాలతో భయం..భయం


వేలాడుతున్న విద్యుత్ వైర్లు, తుప్పుపట్టిన స్తంభం

పోలవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పోలవరం, పట్టిసీమ, ఎల్లండీపేట గ్రామాల్లో విద్యుత్ సర్వీసు వైర్లు నివాసాలపైకి, ప్రజానీకం సంచరించే ప్రాంతాల్లో చేతికందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు అడుగున తుప్పపట్టి విరిగిపడే స్థితికి చేరుకున్నాయి. వీటి వల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళనలతో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని సంచరిస్తున్నారు. ఎల్లండీపేట ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ సర్వీసు లైన్లు నివాసాలకు తగిలే అంత ఎత్తులో డాబాలపైకి ఎక్కినవారికి ప్రమాదం జరిగేలా ఉన్నాయి. పట్టిసీమ వీరభద్రపురంలో సర్వీసు వైర్లు నిలిపేందుకు తగినన్ని స్తంభాలు లేక వీధుల్లో మనుషుల చేతికి తగిలే అంత ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. యడ్లగూడెం గ్రామంలో సర్పంచ్ ఇంటికి సమీపంలో విద్యుత్ స్తంభం అడుగున తుప్పపట్టి విరిగిపడే స్థితికి చేరుకుంది. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

● ఇంటిపై ఒరిగిన విద్యుత్ స్తంభం



పోలవరం మండల కేంద్రంలో విద్యుత్ స్తంభం శనివారం రాత్రి ఇంటిపైకి ఒరిగింది. ఎవ్వరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏటిగట్టు సెంటర్ సమీపంలో విద్యుత్ స్తంభం అడుగున వర్షానికి మట్టి కొట్టుకుపోవడంతో నివాసాల పైకి ఒరిగింది. గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ కార్యాలయానికి సమాచారం అందించడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి స్తంభాన్ని పునరుద్ధరించారు. విద్యుత్ వైర్లు ఆటో యూనియన్ షెడ్డు, ఇతర వ్యాపార సంస్థల పైకప్పులకు, ఏటిగట్టుకి ఆనుకుని ఉన్న ఫ్లెక్సీ బోర్డులకు తగిలి వాటికి విద్యుత్ సరఫరా జరిగింది. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడం పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభాలకు అడుగున బలంగా కాంక్రీటు వేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి వదర్లపాడు రైల్వే గేటు మూత

కైకలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కైకలూరు-ఆకివీడు రైలు మార్గంలో వదర్లపాడు రైల్వేగేటు ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు మూసివేస్తున్నట్టు కైకలూరు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎండీ రెహమాన్ తెలిపారు. జాతీయ రహదారిపై వదర్లపాడు బ్రాంచి నుంచి సీతనపల్లి వెళ్లే రహదారిలోని 86వ నంబరు రైల్వేగేటును మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నామని, ఆ రహదారిలో వెళ్లే వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కైకలూరు సబ్ స్టేషన్లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. కైకలూరు, ఆచవరం, వింజరం, శ్యామలాంబపురం, గోపవరం, రాచపట్నం గ్రామాల్లో గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. ముఖ్యంగా కైకలూరు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు గమనించాలన్నారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

'గేట్' శిక్షణకు ఆన్‌లైన్ పరీక్ష

నూజివీడు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గేట్ ప్రవేశ పరీక్షకు తర్ఫీదు ఇస్తూ ఆర్జీయూకేటీ పరిధిలో హయ్యర్ ఎడ్యుకేషన్, కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ సెల్ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షను నిర్వహించారు. ఇంజినీరింగ్ తృతీయ చివరి సంవత్సరం విద్యార్థులు సుమారు 1500 మంది ఈ ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారు. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వర్సిటీ అధికారుల బృందం తెలిపింది. దాదాపు 150 మంది ఏఎస్ అకాడమీ నుంచి ఉచిత లెక్చర్స్, టెక్ట్స్ సిరీస్ అందించటం జరుగుతుందని, వర్సిటీ తరఫున 500 మందికి, సంబంధిత మెటీరియల్ ఇస్తామని, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఏవో డాక్టర్ లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకడమిక్ డి.శ్రావణి, పి.శ్యామ్, డాక్టర్ సాదు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

గ్రామసభలపై అవగాహన కల్పించండి

మండవల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో జరిగే గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి. అప్పారావు అన్నారు. మండవల్లి మండల కమిటీ అధ్యక్షుడు గంజాల శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం మండవల్లి స్టేషన్ సెంటర్లోని ఐక్యవేదిక కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో గ్రామసభల సక్రమ నిర్వహణ, సమాచార హక్కు చట్టం 2005 అమలుపై చర్చించారు. ప్రజలకు ప్రజాస్వామ్యంపై సరైన అవగాహన లేకపోవడంతో గ్రామసభలకు హాజరు కాలేకపోతున్నారని, ప్రజలను చైతన్య పరిచి గ్రామసభలకు హాజరయ్యేలా చేసి వారు సమస్యలపై ప్రశ్నించి నపుడు మాత్రమే గ్రామ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కుందేటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



వెండిని బహూకరిస్తున్న కట్టా గోపి దంపతులు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి బహూకరణ

ముదినేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటర్ లోని శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యే శ్వరస్వామికి కలిదిండి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కట్టా గోపి రూ.70 వేల విలువైన అరకేజీ వెండిని బహూకరించారు. ఆదివారం గోపి దంపతులు వెండిని అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ, దేవస్థానం సిబ్బందికి అందజేశారు. టీడీపీ నాయకులు బొర్రా చలమయ్య, పరసా ఏడుకొండలు, బొంగు రవికుమార్, బొర్రా శేషుబాబు, జక్కుల విజయ కుమార్, కట్టా రాఘవులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీహరిపురంలోని షిర్డిసాయిబాబా మందిరంలో మందిర చైర్మన్ పరసా ఏడుకొండలు ఆధ్వర్యంలో నాయకులు పూజలు నిర్వహించారు.

శాశ్వత ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం



సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాశ్వత ఉచిత శిక్షణ కేంద్ర భవనం

కైకలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమితి ముందంజలో ఉంటుందని సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు అన్నారు. ఆదివారం కైకలూరు సత్యసాయి సేవా సమితిలో నూతనంగా నిర్మించిన శ్రీసత్యసాయి శాశ్వత ఉచిత ఉపాధి శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఎంతో కాలంగా సమితి ఆధ్వర్యంలో అనేకమందికి ఉపాధి కల్పన కోసం శిక్షణ తరగతులు నిర్వహించామని, నిత్యం యువతకు ఉపాధి కల్పించేందుకు నూతనంగా ఉపాధి శిక్షణా కేంద్రాన్ని ప్రారంబిస్తున్నామని దీనిని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. సురేంద్ర, సేవాదళ్ కో-ఆర్డినేటర్లు కె. శ్యాంప్రసాద్, జి. శాంతి, జిల్లా అధ్యక్షుడు కె శశిశేఖరరావు, మానవత సంస్థ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, సర్పంచ్ కేవీఎస్ఎం నాయుడు, వ్యాపారవేత్త సమయమంతుల పురుషోత్తం, కైకలూరు సబ్ జోన్ ఇన్‌చార్జి జీవీడీ కృష్ణ మోహన్, సమితి కన్వీనర్ కె. వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన పెద్దింటమ్మ ఆలయం

కైకలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసి పోయింది. మహిళలు ఆలయ ఆవరణలో పాల పొంగళ్ళను పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు జరిపారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లా బధిరుల సంఘం నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా బధిరుల సంఘ సమావేశం ఆదివారం స్థానిక యాదవ సంఘం భవనంలో జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి ప్రవీణ్‌వర్మ, ఉపాధ్యక్షులుగా సిహెచ్ వీరబాబు, ఎస్ సుధారాణి, జనరల్ సెక్రటరీగా వి నాగబాబు, జాయింట్ సెక్రటరీగా వి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా కె నవీన్, సభ్యులుగా జి అచ్యుత సాయిరాం, కే రాంబాబు ఎన్నికయ్యారు. బధిరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి చంద్రశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



పోలవరంలో నాసిరకం వరి విత్తనాలతో సాగు చేసిన పొలాన్ని చూపిస్తున్న రైతులు

నిండా మునిగాం..

- మూడు రకాలుగా పంట స్థితి
- నకిలీ వరి విత్తనాలతో నష్టపోయామంటున్న రైతులు
- పరిహారం ఇప్పించాలని వేడుకోలు

చాట్రాయి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నాసిరకం వరి విత్తనాలతో నిండా మునిగామని మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి కంపెనీ నుంచి పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. బాధిత రైతులు మాట్లాడుతూ పోలవరంలోని ఒక దుకాణం నుంచి పీఎల్‌పీ 1100 వరి విత్తనాలు కొనుగోలు చేసి ఖరీఫ్ సాగు చేశామని, 130 నుంచి 140 రోజులకు కోతకు రావాల్సిన పైరు 60 రోజులకే కొంత ఈనిందని, మరి కొంత బిర్రు పొట్ట, మిగిలింది చిరుపొట్ట దశల్లో ఉన్నాయని, సదరు షాపులో సుమారు 50 మంది రైతులు 80 ప్యాకెట్లు వరి విత్తనాలు కొనుగోలు చేసి సుమారు 160 ఎకరాల్లో సాగు చేసినట్లు రైతులు తెలిపారు. పొలంలో ఇప్పుడు ఈనిన కంకులు పిట్టలు తినేస్తున్నాయని, మూడు రకాలు వరి విత్తనాలు వల్ల పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. అధికారులు పరిశీలించి తమ కు న్యాయం చెయ్యాలని రైతులు వేడుకొంటున్నారు.



నాసిరకం విత్తనాలతో కోలుకోలేని దెబ్బ

నాకు ఉన్న ఎకరం సొంత భూమిలో నాసిరకం వరి విత్తనాలు వేసి కోలుకోలేని దెబ్బతిన్నా. ఎకరానికి రూ. 25 వేలు పెట్టుబడి పెట్టా. 30 బస్తాలు దిగుబడి వచ్చేది, ఇప్పుడు 15 బస్తాలు కూడా వచ్చే అవకాశం లేదు. అధికారులు పరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

- సత్తినపల్లి వెంకటేశ్వరరావు, బాధిత రైతు, పోలవరం, చాట్రాయి మండలం.



పరిహారం ఇప్పించి ఆదుకోవాలి

రెండు ఎకరాలు భూమి కౌలుకు తీసుకొని నాసిరకం వరి విత్తనాలు సాగు చేశా. సాగుకు రూ. 50 వేలు పెట్టుబడి, కౌలు రూ. 30 వేలు కలిపి రూ. 80 వేలు నష్టపోయే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సదరు విత్తన కంపెనీ నుంచి పరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

- సత్తినపల్లి సుగుణరావు, బాధిత కౌలు రైతు, పోలవరం, చాట్రాయి మండలం.

అధికారులు ఉత్తమ సేవలు అందించాలి : ఐజీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని చట్టప్రకారం పరిష్కరించి సమర్థవంతమైన అధికారులుగా ఉత్తమ సేవలను ప్రజలకు అందించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదివారం ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు. ఏలూరు రేంజ్ కార్యాలయంలో ప్రొబేషనరీ డీఎస్పీల పనితీరుపై సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్పీల ఉద్యోగ నిర్వహణ, క్షేత్రస్థాయిలో పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు లా అండ్ ఆర్డర్‌లో నిర్వర్తించిన విధులను సమర్థవంతంగా నేర్చుకుని భవిష్యత్ కాలంలో వాటిని వినియోగించుకోవాలని సూచించారు, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ఆలకించి తగిన సూచనలు, సలహాలతో క్రిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ శివకిశోర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

పోరాటాలతోనే హక్కుల సాధన

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారామ్మోహన్ రాయ్



నూజివీడులో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

నూజివీడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే హక్కులను సాధించుకోవచ్చని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారామ్మోహన్ రాయ్ అన్నారు. నూజివీడులో జరుగుతున్న సీఐటీయూ ఏలూరు జిల్లా 13వ మహా సభలు ఆదివారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన కార్మిక శాఖ వాటిని నవ్వులపాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఆర్వీఎస్ నారాయణ, కేవీకేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు 'ఉల్లి' రాక

10 లారీల మహారాష్ట్ర, 3 లారీల కడప, కర్నూలు ఉల్లి దిగుమతి



తాడేపల్లిగూడెం మార్కెట్లో ఉల్లిని పరిశీలిస్తున్న జేసీ

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి ఆదివారం 10 లారీల్లో ఉల్లిపాయలు వచ్చాయి. వీటిని క్వింటా రూ.1000 నుంచి రూ.1700 మధ్య విక్రయించారు. మంచి ఆరుదల, పాతపాయ ధర తగ్గింది. సైజు, నాణ్యత ఆధారంగా వ్యాపారులు మహారాష్ట్ర ఉల్లికి ధరను నిర్ణయించారు.

కడప, కర్నూలు నుంచి మూడు లారీల ఉల్లి..

మార్కెట్‌కు కడప నుంచి రెండు లారీలు, కర్నూలు నుంచి ఒక లారీ ఉల్లిని అక్కడి రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. మూడు లారీల్లో సుమారు 52 టన్నులు వచ్చింది. వీటిలో 32 టన్నుల ఉల్లి మార్కెట్లో రూ.700 నుంచి 1200 మధ్య విక్రయాలు జరిగాయి. వీటిలో 20 టన్నుల ఉల్లికి క్వింటా రూ.600కు దిగువన ధర పలకడంతో జిల్లా జేసీ ఆదేశాలతో ఈ 20 టన్నుల ఉల్లిని వ్యాపారులకు అమ్మకుండా సొసైటీల ద్వారా విక్రయించే చర్యలు చేపడుతున్నారు.

కర్నూలు ఉల్లిని వినియోగించేలా చర్యలు చేపట్టాలి : జేసీ

కర్నూలు ఉల్లిని వినియోగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రైతులకు లాభదాయకమైన ధరలను అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి వ్యాపారులకు సూచించారు. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి హోల్‌సేల్ ఉల్లి మార్కెట్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కడప, కర్నూలు నుంచి వచ్చిన ఉల్లి ఆక్షన్‌ను స్వయంగా ఆయన పరిశీలించారు. ఉల్లి ధర తక్కువ పలకడంతో హోల్‌సేల్ వ్యాపారులతో ఆయన మాట్లాడారు. కడప, కర్నూలు నుంచి వచ్చిన ఉల్లిని కొనడం ద్వారా ఉల్లి రైతులను ఆదుకోవచ్చన్నారు. ఇక్కడ వచ్చే రేటు కంటే ఎక్కువ రేటుల వచ్చే విధంగా మార్కెట్ యార్డులు, రైతు బజార్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధరల లభించకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని కనీస మద్దతు ధర కల్పించేలా వ్యాపారులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్‌కౌసర్ భానో, మార్కెటింగ్ శాఖ డీడీ పాపారావు, ఏడీ సునీల్‌కుమార్, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, హోల్‌సేల్ వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్.. టెర్రర్!

కలిదిండి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలిదిండి సెంటర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఫ్యూజ్ వైర్లు, బాక్స్ చేతికి అందే విధంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ కింద ప్రయాణికులు కూర్చోవటానికి బల్లలు వేశారు. పూలు, పండ్ల దుకాణాలు కూడా ఉండటంతోపాటు బస్సులు, ఆటోలు కూడా ఇక్కడే నిలుపుదల చేయటంతో రద్దీగా ఉంటుంది. గాలి వీచినప్పుడు ట్రాన్స్ ఫార్మర్ వద్ద వైర్లు కలవటంతో పలుమార్లు నిప్పు రవ్వలు రాలి జనం మీద పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న పూలు, పండ్ల దుకాణాలు, బల్లలను విద్యుత్ శాఖ అధికారులు పలుమార్లు తొలగించినప్పటికీ మరలా వ్యాపారాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శాశ్వత రక్షణ వలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చినుకు పడితే.. చింతే!

ముదినేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే నడిచేందుకు సైతం నరకయాతనగా మారుతోంది ముదినేపల్లి మండలం కోడూరు ఆర్అండ్‌బీ రహదారి. నంబరు 165 పామర్రు - దిగమర్రు జాతీయ రహదారి నుంచి కోడూరు వెళ్లే ఈ రహదారి సుమారు ఐదు కిలోమీటర్లు వర్షం పడితే ప్రమాదకరంగా తయారవుతున్నది. రోడ్డుకిరువైపులా పంట బోదెల తవ్వకాల వల్ల మట్టి వర్షాలకు కరిగి రోడ్డుపైకి రావడంతో బురద పేరుకుపోయి ప్రమాదకరంగా ఉంది. రోడ్డుపై వాహనాలు కూడా జారిపోతున్నాయి. రోడ్డు పూర్తిగా గోతులమయమై బురదతో బయటకు వెళ్లాలంటే భయంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్డు దుస్థితి వల్ల ఆర్టీసీ బస్‌లు రావడం లేదని, ఆటో డ్రైవర్లు కూడా కిరాయిలకు రావటం కూడా కష్టంగానే ఉందని, అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

ముసునూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన కాటేపల్లి మరియమ్మకు తిప్పనకుంటకు చెందిన వసంతరావుకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా వసంతకుమార్ మద్యం తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ మేరకు మరియమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. చిరంజీవి తెలిపారు.

నేడు ద్వారకా తిరుమలలో శ్రీకృష్ణ జయంతి

ఆర్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణజయంతి ఉత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. అష్టమి మిగులు తిథితో పాటు రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగే ఈ ఉత్సవం నేపథ్యంలో స్వామివారికి నిత్యం నిర్వహించే ఆర్జిత కల్యాణం, నిత్యార్జిత సేవలను సోమవారం రద్దు చేస్తున్నట్లు ఈఓ వివరించారు. సాయంకాలం ఉత్సవం అనంతరం నివేదనాది కార్యక్రమాలు జరుగు తాయన్నారు. అలాగే మంగళవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్ల పండుగ, గ్రామోత్సవం జరుగుతాయని భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.



పునరుద్ధరించిన పల్లె వెలుగు బస్సు

లంక గ్రామాలకు బస్సుల పునరుద్ధరణ

కలిదిండి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాలైన కొత్తూరు, సంతోషపురం, భాస్కరరావుపేట, మూల్లంక, పెదలంక గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించారు. మూల్లంక - పెదలంక రహదారిపై భారీ గోతులు ఏర్పడటంతో బస్సుల రాకపోకలను ఆర్టీసీ అధికారులు నిలుపుదల చేశారు. దీంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు రైతులు స్వచ్ఛందంగా మూల్లంక నుంచి పెదలంక వరకు 7 కిలోమీటర్ల మేర రహదారికి మరమ్మతులు చేశారు. దీంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గుడివాడ, విజయవాడ, భీమవరం డిపో మేనేజర్లతో ఫోన్‌లో మాట్లాడటంతో లంక గ్రామాలకు బస్సులను పునరు ద్ధరించారని డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, రైతులు తెలిపారు. దీంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ద్వారకాతిరుమలలో రికార్డు అసిస్టెంట్ చేతివాటం

ద్వారకాతిరుమల,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానంలో లీజెస్ విభాగంలో పనిచేసే ఓ రికార్డు అసిస్టెంట్ చేతివాటం ప్రదర్శించాడు. గతనెలలో దేవస్థానం నిర్వహించిన వేలంపాటలో పాటదారుడు చెల్లించిన సొమ్ములో రూ.9వేలు తగ్గించి మిస్‌లీనియస్ రసీదు రాసినట్టు సమాచారం. టీటీడీ కాంప్లెక్స్ షాప్ నంబరు 11కు సంబంధించి జరిగిన వేలంపాటలో సదరు రికార్డు అసిస్టెంట్ అనుమంచిపోలు సాయి చేతివాటం ప్రదర్శించాడు. దీన్ని కప్పి పుచ్చేందుకు కొందరు ఉద్యోగులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. హెచ్చు పాటదారుడు సిద్ధయ్య ఆగస్టు ఆరో తేదీన షాపు అద్దె సొమ్ము రూ.51 వేలును రికార్డు అసిస్టెంట్‌కు కట్టాడు. ఆ ఉద్యోగి ఇచ్చిన సొమ్ము మొత్తానికి ఎంఆర్ రాయకుండా రూ.9వేలు తగ్గించి రూ.42వేలుకు మాత్రమే రాశాడు. ఇదిలా ఉంటే రెండురోజుల క్రితం లీజెస్ విభాగం ఏఈవో రమణరాజు పాటదారుడు సిద్ధయ్యకు ఫోన్‌కు చేసి అద్దె చెల్లించమని అడిగాడు. తాను ఆగస్టులోనే రూ.51వేలు చెల్లించానని ఇంకా రూ.7వేలు మాత్రమే బాకీ ఉందని చెప్పాడు. దీనిపై ఏఈవో రూ.42వేలు మాత్రమే కట్టావని చెప్పడంతో అతడు కంగుతిన్నాడు. రికార్డు అసిస్టెంట్ రూ.9వేలు తగ్గించి ఎంఆర్ రాశాడని ఏఈవో రమణరాజు వివరణ ఇచ్చారు. అయితే బాధితుడు సిద్ధయ్య ఇంకా ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

24న ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ముసునూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బలివే గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేస్తూ ఇటీవల దేవదాయ ధర్మదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయంలో ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం జరుగుతుందని ఈవో తెలిపారు.

స్వర్ణకారులను ఆదుకోవాలి: గోపి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జ్యువెలరీ షాపుల రాకతో స్థానిక స్వర్ణకారులకు ఉపాధి కరువై రోడ్డున పడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వర్ణకారులను ఆదుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి (గోపి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణకారులకి 40% వడ్డీతో 20 లక్షల రుణం మంజూరు చేయాలని, 50 ఏళ్ళ పైబడిన స్వర్ణకారులకు రూ. 6 వేలు పెన్షన్ ఇవ్వాలని, స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ముదినేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పేరూరు గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం అకస్మాత్తుగా మరణించిన వీర్ల ఝాన్సీ (50) అనే ఒంటరి మహిళ అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ. 5 వేలు సహాయం అందించారు. ఝాన్సీ భర్త 15 ఏళ్ల క్రితం మరణించాడు. ఆమెకు సంతానం లేరు. కిడ్నీ వ్యాధికి గురైన ఝాన్సీ తన సోదరుడి సహకారంతో జీవిస్తున్నది. నిరుపేద అయిన ఆమె అంత్యక్రియలకు వైష్ణవి తరఫున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ ఆర్థిక సాయాన్ని ఝాన్సీ బంధువులకు అందజేశారు.